ఆత్మ కథ రాయటమా? మానటమా?
పేమూరి వేంకటేశ్వరరావు

1

నా జీవిత చరిత్ర రాసుకుంటే ఎలా ఉంటుందో అని అప్పుడప్పుడు అనిపించేది. సామాన్యుడి జీవితంలో చెప్పుకోదగ్గ విషయాలు ఏముంటాయి? “అయినా సరే స్వీయ చరిత్ర రాయటంలో కొంత సొగసుంది. కనీసం దినచర్య లాగో, "జర్నల్" లాగో కొద్ది పేజీలు రాసి చూడండి," అన్నారు శ్రీ పెమ్మరాజు వేణుగోపాల రావు, "ఇంగ్లీషులో రాయండి. మన పిల్లలు పెద్దవాళ్ళైన తర్వాత చదువుకుంటారు." ఈ సలహా నా బుర్రకి ఎక్క లేదు.

అవి శ్రీ రాచకొండ విశ్వనాథ శాస్త్రి పరమపదించిన కొత్త రోజులు. అప్పట్లో బతికున్న తెలుగు రచయితలలో విశ్వనాథ శాస్త్రి అగ్రగణ్యుడని చందూరి మురళి ఎన్నో సార్లు అనటంతో ఇప్పుడేనా ఆయన రాసిన రాతలు చదవకపోతే పరువు పోతుందని భయపడుతూన్న రోజులవి. విశ్వనాథ శాస్త్రి అంత కొమ్ములు తిరిగిన వాడని అంతవరకు నాకు తెలియదు. నేను అమెరికా రాక పూర్వం ఆయన కథలు చూసిన జ్ఞాపకం లేదు.

ఈ సందర్భంలోనే విశ్వనాథ శాస్త్రి తన చిన్నతనంలో రాసుకున్న దినచర్యని కొన్నాళ్ళు రచన పత్రికలో ప్రచురించేరు. ఈ అవకాశం జారవిడవ కూడదని ఆ దినచర్యని చదవటం మొదలు పెట్టేను - పువ్వు పరిమళించే ముందు ఎలా ఉంటుందో చూడాలన్న కుతూహలంతో. దరిమిలా శాస్త్రి వారసులు కోర్టు నోటీసు ఇచ్చి ఆ ప్రచురణని ఆపు చేయించేరు. ఇంతకీ చెప్పొచ్చే విషయం ఏమిటంటే ఆ దినచర్యని చదువుతూన్నంత సేపూ ఆ రోజులలో సమాజం ఎలా ఉండేదో, ఒక కుటుంబంలో ఆర్థిక పరిస్థితులు ఎలా ఉండేవో కొంచెం అవగాహన అయింది. కనుక దినచర్యలకి, జీవిత చరిత్రలకి ఓ స్థానం ఉందన్న మాటే కదా!

చరిత్ర పుస్తకాలు చదువుతూ ఉంటే పూర్వ కాలంలో రాజులు ఏమిటి చేసేరో తెలుస్తుంది కాని, సామాన్యులు ఎలా బతికేవారో అర్థం కాదు. ఎక్కడో శ్రీనాథుడి లాంటి కవులు సామాన్యుల గురించి రాసేరు తప్ప, మిగిలిన చరిత్ర అంతా పాలక వర్గానిదే.

నా జీవితంలో చెప్పుకోదగ్గ సంఘటనలు లేకపోయినా నేను కలసిన వ్యక్తులు ప్రసిద్ధులు కావచ్చు, చూసిన సంఘటనలు చారిత్రాత్మకం కావచ్చు, గడపిన రోజులు గడ్డు రోజులు కావచ్చు. అందుకని ఆత్మకథ రాసి చూద్దామనే నిశ్చయానికే వచ్చేను. కాని కీబోర్డు మీద వేళ్ళు కదనం చెయ్య లేదు.

ఈ ఆలోచనలన్నీ 1995 నాటివి. ఆ ఏడు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ శత జయంతి. అందుకని ప్రపంచ వ్యాప్తంగా, తెలుగు వాళ్ళున్న అన్ని దేశాలలోనూ, చంద్రుడికో నూలు పోగులా, కవి సామ్రాట్టు గురించి ఎవరికి తోచిన విధంగా వారు మననం చేసుకుంటున్నారు.

శ్రీ సత్యనారాయణ గారి శత జయంతితో పాటు శ్రీ అడవి బాపిరాజు శత జయంతి కూడ కలిపి, రెండూ ఒకే సారి దశమ తానా సభలలో, 4 జులై 1995 న షికాగోలో జరిపేరు. ఆ సభకి నేను వెళ్ళటం తటస్థ పడింది. శ్రీ బాపిరాజు గురించి నాలుగు ముక్కలు చెప్పమని ద్రోణంరాజు రామకృష్ణ, జొన్నలగెడ్డ మల్లేశ్వర శర్మ అదేశించారు. నాకు సత్యనారాయణ గారి గురించి బహు కొద్దిగా తెలుసు. భిలాయిలో ఉన్నప్పుడు, వేయిపడగలు చదివినట్లు లీలగా జ్ఞాపకం ఉంది. బాపిరాజు గారి గురించి ఆమాత్రం కూడ తెలియదు. నారాయణరావు ని చదివిన జ్ఞాపకమే లేదు!

అవి నేను బందరు హిందూ కాలేజీలో ఇంటరు చదువుతూన్న రోజులు. పాఠ్యభాగాలని ముక్కున పట్టి పరీక్ష పత్రాలని నింపడమే తప్ప తెలుగు సాహిత్యం తో పరిచయం అంతంత మాత్రమే అయిన డింభక దశలో ఉన్న నాకు తోటి విద్యార్థి, సూరపనేని వెంకటరామయ్య తో పరిచయం అయింది. అతను పదహారేళ్ళనాడే తెలుగు పద్యాలు రాసేవాడు! గుర్రం జాషువా గబ్బిలాన్ని నాకు పరిచయం చేసి, నా చేత ఆ పుస్తకం చదివించేడు. అర్థం కాలేదు కాని చదివేను. త్రిపురనేని రామస్వామి చౌదరి పేరు ఇతను చెప్పగానే నేను మొట్టమొదట విన్నాను. గొడుగు పేటలో ఉన్న శంకర మఠంలో సత్యనారాయణ గారు శ్రీమద్రామాయణ కల్పవృక్షంలో పద్యాలు చదివి వినిపిస్తారని విని అతనే నన్ను లాక్కెళ్ళేడు.

చిన్న సభా మందిరం పెద్దలతో కిటకిటలాడిపోయి ఉంది. నేను, వెంకటరామయ్య - మేమిద్దరమే చిన్న వయస్సు వాళ్ళం! సత్యనారాయణ గారు పద్యాలు పాడుతూ ఉంటే శ్రవణానందమే! వాటి అర్థం ఆయన విడమర్చి చెబుతూ ఉంటే ఆహ్ అనిపించింది. నారికేళ పాకం అనిపించనే లేదు. నేను సత్యనారాయణ గారిని శంకర మఠంలో మొదటి సారి చూసినప్పుడు ఒక దినచర్య పొత్తంలో నా అనుభవాలు రాసుకుని ఉండుంటే ఆ అనుభవాలు జ్ఞాపకాలుగా మారి ఎంత బాగా ఉపయోగ పడేవో కదా అని అనుకున్నాను.

కాని ప్రస్తుతం నా భుజాల మీద ఉన్నది బాపిరాజు గారి గురించి మాట్లాడే బాధ్యత. ఆయన రాసిన "రాగమాలిక" అనే కథానికల సంకలనం ఒకటీ, నారాయణరావు ప్రతిని ఒకటీ నా చేతిలో పెట్టి ఆ రాత్రికి రాత్రి ఆ రెండు పుస్తకాలూ చదివి మర్నాడు ఉపన్యాసం ఇమ్మన్నారు.

మరి తప్పింది కాదు. రాత్రి తెల్లవార్లూ మేలుకుని ఆ రెండు పుస్తకాలూ వీలయినంత మట్టుకు చదివేను. చదువుతూన్నంత సేపూ నా మనస్సు పరి పరి విధాల బందరు వైపు పరిగెడుతూనే ఉంది.

నేను చదువుకి బందరు వెళ్ళిన కొత్తలోనే అడవి బాపిరాజు స్వర్గస్తులయారు. అప్పటికే శ్రీ శివకామయ్య ఆంధ్ర జాతీయ కళాశాలకి ప్రిన్సుపాలు పదవిలో ఉన్నారు. ఆ స్థానంలో బాపిరాజు ఉండేవారు కనుక ఆయన మరణం ఆ కాలేజీలో పెద్ద వార్త. ఇలా ఆ అర్ధ రాత్రి జ్ఞాపకాల దొంతరలు తరుముకొస్తూ ఉండగా రాగమాలిక, నారాయణరావు చదివేను. రాగమాలికలో గుడ్డిపిల్ల కథ నన్ను బాగా ఆకర్షించింది. ఆ కథలో ఒక కుంటి వాడు రైలు బండిలో బిచ్చమెత్తుకుంటూ

ఒక గుడ్డి పిల్లని కలుసుకుంటాడు. తర్వాత ఆ పిల్లనే పెళ్ళి చేసుకుంటాడు. ఆ కథ చదువుతూ ఉన్నంత సేపూ బందరులో నంజప్ప హొటేలుకి ఎదురుగా ఉన్న రాబర్ట్‌సన్ పార్కు గేటు పక్కని ఒంటి కాలి మీద నిలబడి "శాంత మూర్తివని భ్రాంతి చెందితిని, కోపమేల శ్రీరామా!" అన్న పాట పాడుతూ ఉండే ఒక కుంటి వాడు నా కళ్ళకి కట్టినట్లు అలా కనిపిస్తూనే ఉన్నాడు. గుండెలని కరగించే ఆ పాట ఇప్పటికీ నాకు చెవులలో వినిపిస్తూనే ఉంటుంది. అతని పక్కనే ఒక గుడ్డి మనిషి కూర్చుని ఉండేది. బాపిరాజు గారి కథ లోని కుంటి వాడు, గుడ్డి పిల్ల వీళ్ళేనా అన్న అనుమానం ఆ రాత్రి నా మనస్సులో మెదిలిన మాట వాస్తవం. నా చిన్నతనంలోనే ఈ గుడ్డిపిల్ల కథ చదివి ఉంటే, ఆ తర్వాత ఆ ముష్టి పిల్లని చూసుంటే, చిన్నక్కతో ఆంధ్ర జాతీయ కళాశాలకి వెళ్ళినప్పుడు బాపిరాజుగారిని కలుసుకునే అవకాశం దొరికి ఉంటే, అప్పుడు నా నోట్లో తడి ఆరిపోకుండా ఉండి వుంటే, ఈ విషయం ఆయననే అడిగి ఉండేవాడినేమో!

ఆ రాత్రి బాపిరాజు గారి రచనలలో రైలుబండి ప్రసక్తి పునరావృత్తమౌతూ పదే పదే (అనగా, ఇంగ్లీషులో చెప్పాలంటే, రైలుబండి "మోటిఫ్") ఎక్కువగా కనిపించింది. నారాయణరావు నవల రైలుబండి ప్రయాణంతోటే మొదలవుతుంది. గుడ్డిపిల్ల కథ కూడ రైలు బండి ప్రయాణం తోటే మొదలవుతుంది. ఈ సంగతులే షికాగో సమావేశంలో చెప్పేను. ఒక సభలో నిలబడి తెలుగులో ప్రసంగించడం నాకు అదే మొదటిసారి.

ఈ సమావేశంలో నా ఉపన్యాసం అయిపోయిన తర్వాత బయటకి వస్తూ ఉంటే ఎవరో ఇండియా నుండి మొదటిసారిగా అమెరికా వచ్చిన వ్యక్తిలా ఒకాయన కనిపించేరు. ఆ బట్ట, ఆ కట్టూ, ఆ తీరూ, ఆ చూపూ ... అన్నీ కూడా ఆయన ఎవ్వరయి ఉంటారో కొట్టొచ్చినట్లు చెప్పక చెబుతున్నాయి. ఎవ్వరో రైతు అనుకున్నాను. కాకపోతే ఏ పల్లెటూరి బైతో అయుంటాడులే అనుకుంటూ, "మన దేశం నుండి వచ్చిన వ్యక్తిలా ఉన్నాడు, పోనీ పలకరిస్తే ఏమి పోయిందిలే" అనుకుంటూ పలకరించి ఆయన "బేడ్జి" మీద పేరు చూసేను.

మధురాంతకం రాజారాం!

గతుక్కు మన్నాను. కాని ఏమీ తొణక్కుండా మాట్లాడుతున్నాను. ఆహా, ఓహోలు ఎంతసేపని? ఏదో విషయం ప్రస్తావించాలిగా! ఈ మాటా ఆ మాటా చెబుతూ ఆయన రాసిన కథ ఏదైన గుర్తుకు వస్తుందేమో అని మస్తిష్కంలో శోధన యంత్రాన్ని నడపటం మొదలు పెట్టేను.

"మీరు రాసిన కథ ఒకటి ఎప్పుడో చిన్నప్పుడు చదివేను. ఇప్పటికీ నాకు అంతా వివరంగా జ్ఞాపకం ఉంది" అంటూ ఆ కథ యొక్క నఖ చిత్రం ఆయనకి చెప్పేను."

"నేనెప్పుడూ అటువంటి కథ రాయ లేదే."

అప్పుడు గుర్తుకు వచ్చింది. నేను అనుకుంటూన్న కథ రాసినది శ్రీ రావూరి భరద్వాజ అని. నేను మెదలకుండా

సంభాషణని మరొక పక్కకి మళ్ళించేను.

అప్పుడు ఆయన నా పేరేమిటంటూ నా బేడ్జి చూసేరు.

"ఈ మధ్య మీరు రాసిన కథ ఒకటి ఆంధ్ర ప్రభలో చదివేను. సైన్సు అర్ధం కాలేదు కాని, కథ మాత్రం విలక్షణంగా ఉంది" అన్నారు.

ఆయనకి విలక్షణంగా కనిపించిన కథ ఆర్థర్ సి. క్లార్క్ రాసిన ఒక కథని ఆధారంగా తీసుకుని నేను తిరగ రాసిన కథ. పేరు కాకతాళీయం. కథ బాగుందనో, బాగులేదనో అనుంటే బాగుండిపోయేది. ఎటూ తేల్చ కుండా, తుని తగువులా, విలక్షణంగా ఉందంటే ఎలా?

2

పైన రాసిన విషయాలన్నీ ఆత్మకథ నిజంగా రాద్దామన్న కోరికతో రాసినవి కావు - పోతన ఫాంట్లతో ప్రయోగం చేసి చూద్దామనే ఉద్దేశంతో రాసినవి.

ఇంగ్లీషులో వర్డ్ ప్రోసెసర్లు 1985 ప్రాంతాలనాటికి బహుళ ప్రచారంలోకి రాకపోయినా ఆఫీసు వాతావరణాలలో కంప్యూటర్లతో పనిచేసే వారికి అందుబాటులోకి వచ్చేయి. ఇంగ్లీషు అక్షరాలనే వాడి ముగ్గులు వెయ్యటం, దీపావళి శుభాకాంక్షలు అంటూ దీపం బొమ్మలు వెయ్యటం లాంటి ప్రక్రియలతో పాటు తెలుగు అక్షరాలని కూడ ముగ్గు వేసినట్లు అమర్చి ప్రయోగాలు చేసేవారు, ఉత్సాహవంతులు. ఈ సందర్భంలో తెలుగులో వర్డ్ ప్రోసెసర్ నిర్మాణానికి ప్రథమ ప్రయత్నం చేసిన వారు పెమ్మరాజు శ్రీరామారావు, కీ. శే. గోటేటి బాలకృష్ణ మూర్తి. వీరు చేసిన పనిని నేను సంపాదకత్వం వహించిన తానా సూవనీర్‌లో సమీక్షించేను.

తర్వాత, 1986 ప్రాంతాలలో, కేలిఫోర్నియా యూనివర్సిటీ, బర్కిలోని దక్షిణ ఆసియా విభాగంలో పని చేస్తూన్న ప్రొఫెసర్ హార్ట్ అనే ఆసామీ దగ్గర తెలుగు ఫాంట్లు ఉన్నాయని తెలిసి, పాతిక డాలర్లు పెట్టి ఆ ఫాంట్లు కొన్నాను. ఈ ఫాంట్ల వాడకం నేర్చుకోడానికి పిల్లలమర్రి రామకృష్ణ విపరీతంగా సహాయం చేసేడు. ఏతావాతా, ఈ బర్కిలీ ఫాంటు వాడటంలో బాగా ప్రావీణ్యత సంపాదించేను. సాధన చేస్తేనే కదా దేంట్లోనయినా ప్రావీణ్యత వచ్చేది. సాధన చెయ్యడానికి నాకు తయారుగా ఒక పని దొరికింది. అదేమిటంటే....?

1968 నాటికే నాకు సైన్సు తెలుగులో రాయటం ఒక వ్యసనంగా తయారయింది. అప్పట్లో నా దగ్గర నిఘంటువు ఏదీ లేదు. నాకు అవసరమైన మాటలన్నీ చిన్న కాగితాల మీద రాసుకుని, ఆ కాగితాలని చెప్పులతో వచ్చిన అట్ట పెట్టెలో పెట్టి దాచుకునేవాడిని. వాటన్నిటిని ఎలాగైనా అకారదిక్రమంలో అమర్చి కంప్యూటర్లో దాచుకుంటే అవసరం వెంబడి వెతుక్కుని తీసుకోవచ్చు కదా అనే ఊహ ఒకటి ఉండేది. అందుకని నా దగ్గర ఉన్న మాటలన్నిటిని అకారాది క్రమంలో కంప్యూటర్ లోనికి ఎక్కించే పని మొదలు పెట్టేను. బర్కిలీ ఫాంటు తో చేసిన ఈ ప్రయోగమే చివరికి నిఘంటువు రూపం

దాల్చింది.

నేను వాడుతూన్న బర్కీ ఫాంటు అందంగా లేదని కొందరు గొణగటం మొదలు పెట్టేరు. "పోతన" ఫాంటు బాగున్నాదనీ, దానిని వాడమనీ ఒత్తిడి చేసేరు. ఈ కొత్త ఫాంట్లుతో చేసిన ప్రయోగమే "ఆత్మకథ" అన్న సాకుతో ఇలా అవతరించింది.

రాసింది చాలు. పోతన ఫాంట్లు అలవాటయాయి కనుక ఇక ఆపేద్దామనే తరుణంలో "రీడర్స్ డైజెస్ట్" మాసపత్రికలో కాలగమనం మీద ఒక వ్యాసం చూసేను. ఆ వ్యాసకర్త అనేదేమిటంటే, మనకి వయస్సు వస్తూన్నకొద్దీ రోజులు రెక్కలు కట్టుకున్న పిట్టల్లా జోరుగా వెళ్ళిపోతూన్నట్లు అనిపిస్తుందిట. భగవంతుడు ఇచ్చిన ఆయుర్దాయం మించి ఎవ్వరూ బతకలేరు కానీ, కనీసం రోజులు అంత జోరుగా గడచి పోకుండా ఉండటానికి అతనొక చిటకా చెప్పేడు. ఏబయ్యో పడి దాటిన తర్వాత రోజుకి నాలుగైదు పేజీల చొప్పన ఆత్మ కథ రాసుకోమన్నాడు. కనీసం అలాగైనా మరుపు దొంతరల మరుగున పడిపోయిన మధుర స్మృతులని జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఉంటే కాల గమనం మందగించినట్లయి మిగిలిన జీవితాన్ని ఆనందించవచ్చని అంటాడు ఆ ఆసామీ. కనుక జీవిత చరిత్ర రాయడంలో కొన్ని లాభాలు లేకపోలేదు.

పోనీలే, అలాగే రాద్దాం అనుకుంటూ ఉండగా శ్రీ అక్కిరాజు రమాపతిరావు నా చేత శ్రీ తిరుమల రామచంద్ర రాసిన "హంపీనుండి హరప్పా దాకా" కొనిపించేరు. అది చదివిన తర్వాత నేను సగం సగం రాసిన ఆత్మకథని అక్కడికక్కడే అపేద్దామన్న కోరిక పుట్టింది. రామచంద్ర "నాకు ఏమీ తెలియదు. నేను చేతకాని వాడిని" అంటూనే బ్రహ్మాండమైన స్వీయ చరిత్ర రాసి పారేసేరు. రాస్తే అలా రాయాలి. తగుదునమ్మా అంటూ నేను జీవిత చరిత్ర రాయడమేమిటి? మనస్సు ఊగిసలాడుతోంది.

3

ఈ తటపటాయింపులతో దరిదాపు ఏడేళ్ళు కదలిపోయేయి. రాసుకుంటూన్నవాడిని రాసుకుంటూ కూర్చోకుండా "నేను నా ఆత్మకథ రాసుకుంటున్నానర్రోయ్" అని అడిగిన వాళ్ళకి, అడగని వాళ్ళకి టముకు వేసి చెప్పే స్వభావం నాది. ఇలా టముకు వేసుకుంటూన్న సందర్భంలో ఇంద్రగంటి పద్మ, శర్మలు - "అయ్యా, తెలుగులో ఉన్న జీవిత చరిత్రలలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథ మీరు తప్పక చదివి తీరాలి" అని ఎన్నో సార్లు అన్నారు. కాని వారి ప్రతి ఎవ్వరో అరువు తీసికెళ్ళేరుట. "ఎప్పుడైనా మీరు మళ్ళా మా ఊరు వచ్చినప్పుడు ఇస్తాం లెండి," అన్నారు. అరువిచ్చిన పుస్తకం తిరిగి రాదని వారికి ఇంకా తెలియని అమాయకపు భ్రమలో ఉన్నారు. అయినా ఆశగా రెండేళ్ళు ఎదురు చూసేను. ఆ పుస్తకం మళ్ళా వాళ్ళ గడప తొక్కలేదు.

జులై 2002 లో ఇండియా వెళ్ళినప్పుడు హైదరాబాదులో పద్మ చెల్లెలు మాధవిని చూడటానికి వెళ్ళేను. వెళ్ళినప్పుడు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి జీవిత చరిత్ర ఊళ్ళో ఎక్కడ దొరుకుతుందని అడిగేను.

"మా ఇంట్లో ఉంది, పట్టికెళ్ళండి" అన్నారు.

"పుస్తకం, వనిత, విత్తం - ఈ మూడు పరహస్తం గతం గత: అంటారు. పైగా నేను పరాయి దేశం వాడిని. కనుక నా పుస్తకం నేను కొనుక్కుంటాను," అన్నాను.

"ఈ పుస్తకం మీరు మళ్ళా తిరిగి మాకు ఇవ్వనక్కరలేదు. ఇది ఇటుపైన మీదే" అంటూ నా చేతిలో పెట్టేరు.

శాస్త్రి గారి "అనుభవాలూ, జ్ఞాపకాలూ" చదివిన తర్వాత నాకు నా కథ రాయటానికి ఒక రకం భయం పట్టుకుంది. అలాగని మానేనా? లేదే! ఎందుకంటారేమో? శాస్త్రి ఉద్దండుడని ఒప్పుకుంటాను. కాని ఆయన రాసిన అనుభవాలూ, జ్ఞాపకాలూ లో, నా దృష్టిలో, అనుగుణ్యత లోపించింది. తెలుగుని ఒక పక్క అందలం ఎక్కిస్తూనే పుస్తకం నిండా సంస్కృత పదాలు గుప్పించి ముంచెత్తేరు. నాలుగు నిఘంటువులు వెతికినా దొరకని మాటలు ఆ పుస్తకం నిండా!!

షరా: నిజానికి తెలుగులో ఆత్మకథలకి కొదువ లేదు. పొరనంది లక్ష్మీ నరసింహం రచ్చబండలో ప్రచురించిన జాబితాలో దరిదాపు ఎనభై ఉన్నాయి. అన్నీ ప్రాచుర్యంలో లేకపోవచ్చు కాని, ఉండటం ఉన్నాయి.

కనుక ఇప్పటికీ ఇంకా ఆలోచిస్తున్నాను, రాయటమా? మానటమా? అని!